


# చిన్ని - నవ్వు

నీ పాల బుగ్గలపై
దోబూచులాడి
నీ నీలి కన్నులలో
తళుక్కుమని
నీ లేత పెదవులపై
నర్తించే
ఆ మనోహర లాస్యాన్ని
యుద్ధోన్మాదులకు
కానుకిస్తే
అప్పటికీ
పోరాటం కొనసాగిస్తే
మారణహోమం ఆపకుంటే
కాలుడే వారికి
సరైన మహీపాలుడు
స్మశానమే వాళ్ల
అసలైన సామ్రాజ్యం

—'స్నేహ'

*1988* వినాయకచవితి మినీ కవితల పోటీలో
రు.*50* ప్రోత్సాహక బహుమతి
గెలుచుకున్న రచన

"ఈసారి మనకు స్పాట్ వాల్యుయేషన్ రాజమండ్రిలో ...ఈనెల 14వ తేదీ నుండి స్టార్టవుతున్నది...ఇవిగో ఆర్డర్స్...మీక్కూడా వచ్చాయి. ఆఫీసుకెళ్ళి తెచ్చుకోండి..." అన్నాడు మా కొలీగ్ మోహన్ ఆ రోజు నేను కాలేజికి వెళ్ళగానే-

"రాజమండ్రిలోనా?... వెరీగుడ్... రాజమండ్రి చూడాలని ఎన్నాళ్ళగానో అనుకుంటున్నాను. ఈ కారణంగానైనా ఆ కోరిక తీరుతున్నందుకు చాలా హేపీగా ఉంది." అన్నాను-

"మీకలాగే ఉంటుంది...యేకొత్తప్లేస్ అన్నా మీరు హుషారుగా బయల్దేరుతారు... నాలాంటి వాడికి ఓ 15 రోజులు పెళ్ళాం పిల్లల్ని వదిలేసి ఆ దిక్కుమాలిన పేపర్లని దిద్దుతూ, హోటల్ తిండి తింటూ గడపాలంటే బలే చిరాగ్గా ఉంటుంది... అది సరేగానీ ఈ రోజే నేను స్టేషన్‌కెళ్ళి 13కు గోదావరికి బెర్త్ రిజర్వ్ చేయించుకుందామనుకుంటున్నాను - మీక్కూడా చేయించమంటారా?" అన్నాడు మోహన్.

"అంతకంటేనా? తప్పకుండా చేయించండి - డబ్బివ్వమంటారా?" అన్నాను-

"డబ్బుసంగతి తర్వాత చూసుకుందాంలెండి- ఎట్లాగూ ఓ పదిహేను రోజులు కలిసే ఉండబోతున్నాంగా." అంటూ మోహన్ స్టాఫ్‌రూంలోంచి బయటకు వెళ్ళాడు.

మోహన్ 13వ తేదీకి రెండు బెర్త్‌లు రిజర్వ్ చేయించుకొని వచ్చాడు.-

13వ తేదీరాత్రి తొమ్మిదిన్నరకు కాజీపేట స్టేషన్ చేరుకొని పదింటికల్లా బ్రయినెక్కాం. 14వ తేదీ తెల్లవారకట్ట నాల్గింటికి రాజమండ్రిలో దిగాం-

రిక్షామాట్లాడుకొని లాడ్జింగ్‌కోసం చాలాసేపు తిరిగాం -స్పాట్‌వాల్యుయేషన్ సీజన్ కావటంవల్ల యేలాడ్జిలో కూడా ఖాళీ లేదన్నారు- ఎక్కడచూసినా పేపర్లు దిద్దటానికొచ్చిన లెక్చరర్లే కనిపించారు. చివరకు 'గెస్ట్‌హౌస్ లాడ్జ్' అనే ఓ లాడ్జ్‌లో మాకు రూమ్ దొరికింది.

స్పాట్‌వాల్యుయేషన్ క్యాంపు ఆ ఊరి జూనియర్ కాలేజీలో పెట్టారు. రైల్వేస్టేషన్‌కు దగ్గర్లోనే జూనియర్ కాలేజి... ఎప్పుడూ వచ్చేపోయే రైళ్ళ రొద - ఆ రైళ్ళు వదిలే పొగ... బూడిద మొదలైన వాటితో ఆ జూనియర్ కాలేజి చాలాఅసహ్యంగా ఉంది - రాజమండ్రి రోడ్లు కూడా చాలా మురికిగా, ఎక్కడ చూసినా దుమ్ము, ధూళితో నిండిపోయి చాలా డర్టీగా కనిపించాయి... "వేదంలా ఘోషించే గోదావరి...అమరధామంలా భాసించే రాజమహేంద్రీ" అన్న పాట వినటానికి చాలా బావుంటుంది... ఆపాటను వింటూ రాజమహేంద్రాన్ని గూర్చి ఊహించుకోవటం కూడా బాగానే ఉంటుంది ... కాని నిజంగా రాజమహేంద్రాన్ని చూడటం మాత్రం యేమీ బావుండదనిపించింది.

ఇంటర్మీడియెట్ విద్యార్థులు రాసిన సమాధానాల్ని చదివి మార్కులు వేసే పని రోజూ 11 గంటలనుండి 5 గంటల వరకు సాగుతుంది - ఆరుగంటలలో 30 పేపర్లు చదివి మార్కులు వెయ్యాలి. అంటే గంటకు ఐదు పేపర్లు చూడాలి - 12 నిముషాలకొక పేపరు - పేపరుకు రూపాయిన్నర చొప్పున పారితోషికం చెల్లిస్తారు-

రోజూ ముప్పై పేపర్లు చదివి మార్కులు వేసి, మార్కుల షీట్ నింపి, చీఫ్ ఎగ్జామినర్‌కు ఆ పేపర్లను అప్పగించి లాడ్జ్ చేరుకునేటప్పటికి విపరీతమైన అలసట వచ్చేసేది. రోజూ ఐదుగంటలకు లాడ్జ్‌కెళ్ళి కాస్త రెస్ట్ తీసుకొని యేడుగంటలకు హోటల్‌కెళ్ళి భోజనం చేసి మళ్ళీ లాడ్జ్‌కొచ్చి కాస్సేపు యేదన్నా చదువుకొని పది గంటలకల్లా నిద్రపోతుండేవాడిని.

మోహన్ దినచర్య వేరుగా ఉండేది. క్యాంపునుండి మూడింటికే బయట పడేవాడు. మేం దిగిన లాడ్జ్‌లోనే దిగిన మాకొలీగ్స్‌తో రోజూ పేకాట వేసుకునేవాడు. పొద్దున క్యాంపు కొచ్చేంతవరకు, సాయంత్రం క్యాంపు నుండి వచ్చేశాక-మోహన్, మరో ఐదారుగురు కలిసి ఎవరి రూమ్‌లోనన్నాచేరి పేకాట ఆడేవాళ్ళు - పార్టీలు చేసుకునేవారు.

పొద్దున పదకొండింటిదాకా రూమ్‌లో ఒక్కడ్నే కూర్చొని గడపటం నాకు పెద్ద సమస్యగా మారింది - క్యాంపును యే తొమ్మిదింటికో, పదింటికో ప్రారంభించక పదకొండింటిదాకా ఎందుకాగుతున్నారంటే ఆ జూనియర్ కాలేజిలో పొద్దున 8 నుండి 11 దాకా ఇంటర్మీడియెట్ విద్యార్థులకు క్లాసులు జరుపాలట-

పదకొండింటిదాకా గడపటం కోసం రాజమండ్రిలో రోజూ ఒక్కొక్క ప్రాంతానికి వెళ్తుండేవాడిని. ఒక రోజు గోదావరి మీద లాంచి ప్రయాణం చాలా సరదాగా ఉంటుందని రాజమండ్రినుండి బొబ్బర్లంక వరకు లాంచీ మీద వెళ్ళొచ్చాను. ఒకరోజు గోదావరి స్టేషన్‌దాకా వెళ్ళి అక్కడికి దగ్గర్లోనే, ఆమధ్యనే ప్రతిష్టించబడిన నన్నయ్య గారి విగ్రహాన్ని చూసొచ్చాను - మరోరోజు గోదావరి మీద నిర్మించబడిన రైల్‌కమ్ రోడ్ బ్రిడ్జిమీద కొంత సేపు కూర్చొని వచ్చేపోయే వాహనాల్ని, గోదావరిని చూస్తూ గడిపాను.

అలా ఒక రోజు మాస్పాట్ వాల్యుయేషన్ క్యాంపుకు దగ్గర్లోనే ఉన్న రాజమండ్రి రైల్వేస్టేషన్ చూద్దామని వెళ్ళాను-

అప్పుడే యేదో ట్రెయినొచ్చి ఆగింది - చాలామంది ప్రయాణీకులు ట్రెయిన్ దిగి హడావుడిగా స్టేషన్ బయటకు వచ్చేస్తున్నారు - అలా వచ్చేస్తున్న ప్రయాణీకు లను "బాబూ! ధర్మం బాబూ! కాళ్ళా



# దోపిడి

-నవీన్

చేతులు లేని వాడ్ని బాబూ! ధర్మంబాబూ!'' అంటూ ఓ పదేళ్ళ కుర్రాడు తోపుడు బండిలో కూర్చొని, తన బండిని తానే తోసుకుంటూ అడుగుతున్నాడు.

ఆ కుర్రాడు నన్ను వెంటనే ఆకర్షించాడు. అందుక్కారణమేమిటంటే వాడు బిచ్చగాడిలా లేడు - కాళ్ళులేవన్నమాటే గాని రాజకుమారుడిలా ఉన్నాడు... తెల్లగా నిగనిగలాడుతున్న శరీరం... గొప్ప తేజస్సుతో కళకళలాడుతున్న గుండ్రని మొహం... చక్రాల్లాంటి హుషారైన కళ్ళు... అంత అందంగా ఉన్న ఆ కుర్రాడికి బిచ్చమెత్తుకోవాల్సిన గతెందుకు పట్టిందోనన్న సానుభూతి అతన్ని చూసిన ప్రతివారిలో కల్గుతుంది. ఆ సానుభూతి కారణంగానేననుకుంటాను హడావుడిగా వెళ్తున్న ప్రయాణీకులంతా ఓ క్షణంసేపు ఆగి, ఆ కుర్రాడికేసి చూసి, బోల్డు జాలిపడిపోయి అతని చేతిలో ఉన్న పైసల డబ్బాలో కొన్ని డబ్బులు పడేసి ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోతున్నారు... చూస్తుండగానే అతని చేతిలో ఉన్న పాత్ర చిల్లరతో నిండిపోయింది.

ఆ కుర్రాడికేసి చాలాసేపు చూస్తూ ఉండిపోయాను. ఓ కళాకారుడు తీర్చిదిద్దినట్టుగా ఉన్న అతని ఉంగరాల జుట్టు, విశాలమైన నుదురు, చక్కని కనుబొమ్మలు, తళతళ మెరుస్తున్న పెద్ద పెద్ద కళ్ళు, ఎర్రటి కోమలమైన శరీరం - చూసేవాళ్ళను వెంటనే ఆకట్టు కుంటున్నాయి - అతనికి రెండు కాళ్ళూ లేవు - అతడు పుట్టుకతోనే అలా పుట్టాడో లేక యేదైనా ప్రమాదంలో అతడు తన కాళ్ళను పోగొట్టుకున్నాడో తెలీదు. నాలుగు చక్రాలున్న తోపుడు బండిమీద కూర్చొని తనే ఆ బండిని త్రోసుకుంటూ వెళ్తున్నాడు.

అతని చేతిలోఉన్న డబ్బుల పాత్ర నిండగానే ఆ కుర్రాడు తన బండిని త్రోసుకుంటూ స్టేషన్ బయటకు వెళ్ళి రోడ్డుమీద వేగంగా వెళ్ళసాగాడు - ''ఎక్కడికెళ్తున్నాడబ్బా!'' అనుకుంటూ నేను స్టేషన్‌లో ఉన్న బుక్‌షాప్ దగ్గరకెళ్ళి కొత్తమాగజీన్స్‌ను చూస్తున్నాను... ఓ పది, పదిహేను నిముషాల్లోనే ఆ కుర్రాడు మళ్ళీ వచ్చాడు - అతని చేతిలో ఉన్న డబ్బుల పాత్ర ఖాళీగా ఉంది. ఇదివరకటి డబ్బంతా ఎక్కడో దాచేసి వచ్చాడని అర్థమైంది. ఎక్కడ దాచి ఉంటాడు? అతడి కెవరైనా ఉన్నారా? అమ్మా...నాన్న...అక్కలు...చెల్లెళ్ళు .. ఆ కుర్రాడితో కాస్సేపు మాట్లాడాలనిపించింది. కాని ఆ కుర్రాడు తోపుడుబండిని త్రోసుకుంటూ ప్లాట్‌ఫాం మీద చాలాదూరం వెళ్ళిపోయాడు-నాకు స్పాట్ వాల్యూయేషన్ క్యాంపుకు వెళ్ళాల్సిన ట్రైన్ కావటంతో నేను స్టేషన్ నుంచి జూనియర్ కాలేజికి వెళ్ళిపోయాను.

ఆ మర్నాడు నేను మళ్ళీ స్టేషన్‌కెళ్ళాను. ఆ కుర్రాడు నిన్నటిలాగే తోపుడు బండి మీద తిరుగుతూ వచ్చీపోయేవాళ్ళ దగ్గర్నుండి డబ్బులడుక్కుంటున్నాడు. ఆ కుర్రాడ్ని చూడగానే చాలామందిలో ''అయ్యో పాపం!'' అన్న భావం కల్గుతోంది. అందుకే ఎవరూ

లేదనకుండా ఆ కుర్రాడి పాత్రలో పది, ఇరవై, యాభై పైసల బిళ్ళల్ని పడేస్తున్నారు. ఓ గంట సేపట్లో ఆ పాత్ర నిండిపోయింది. అది నిండగానే అతడు నిన్నటిలాగే స్టేషన్ బయటకు వెళ్ళి, ఆ డబ్బంతా ఎవరికో ఇచ్చేసి మళ్ళీ స్టేషన్ కొచ్చేస్తున్నాడు- ఆ కుర్రాడు రోజుకు సులభంగా ముప్పై, నలభై రూపాయిలవరకు సంపాదిస్తు న్నాడు - ఆ డబ్బంతా ఎవరు తీసుకుంటున్నారు? ఆ డబ్బులోంచి ఆ కుర్రాడిపోషణకేమన్నా ఖర్చుపెడ్తు న్నారా? ఆ కుర్రాడు కాస్త మంచి బట్టలు కూడా వేసుకోలేదు-

ఆ కుర్రాడి దగ్గర్నుండి ఆ డబ్బును లాగేస్తున్న వాళ్ళెవరో చూడాలనిపించింది.

ఆ మర్నాడు తొమ్మిది గంటలకే స్టేషన్ కొచ్చి ఆ కుర్రాడికోసం చూశాను...కాస్సేపటిదాకా ఆ కుర్రాడు కనిపించలేదు... ఇంతలో యేదో ట్రెయిన్ వొచ్చి ఆగింది. అకస్మాత్తుగా "బాబూ! బాబూ! కాళ్ళులేని వాడిని బాబూ" అన్న ఆ కుర్రాడి మాటలు వినిపించాయి - ఎక్కణ్ణించి వచ్చాడో గాని ట్రెయిన్ రాగనే స్టేషన్లో ప్రత్యక్షమయ్యాడు - అరగంటలో అతని డబ్బుల పాత్ర నిండిపోయింది. నేను రెడీగా ఉన్నాను-

అతడు బండిని తోసుకుంటూ రోడ్డుమీదకొచ్చాడు. నేనతన్ని అనుసరించాను - అతడు రోడ్డుమీద ఒక ఇరవై, ముప్పై గజాలదూరం వెళ్ళి కుడి వైపున ఉన్న పెద్ద చెట్టుకింద ఆగాడు - ఆ చెట్టుకింద ఓ పాతికేళ్ళ స్త్రీ అతనికోసమే ఎదురు చూస్తున్నట్టుగా నిల్చుని ఉంది. వాళ్ళిద్దరికి కొంచెం దూరంలో నిల్చొని చేతిలో ఉన్న మాగజీన్ను చదువుతున్నట్టుగా నటిస్తూ వాళ్ళను గమనిస్తున్నాను.

ఆమెను చూస్తే చాలా ఉన్నతమైన కుటుంబానికి చెందిన స్త్రీలాగే కనిపించింది. ఆమె కట్టుకున్న చీర, జాకెట్ చాలా ఖరీదైనవిగా కనిపించాయి. భుజానికొక అందమైన లెదర్ బాగ్ ఉంది - ఆమె మూడటాని క్కూడా చాలా అందంగా కనిపించింది.

ఆ కుర్రాడు దగ్గరకు రాగానే అతని చేతిలో ఉన్న డబ్బులపాత్రను లాక్కొని ఆ డబ్బంతా తన చంకన ఉన్న బాగ్ లో కుమ్మరించుకొని మళ్ళీ ఆ పాత్రను కుర్రాడి చేతికిచ్చి 'వెళ్ళు' అంది.

"నాకొక్క యాభైపైసలివ్వవే... ఐస్ క్రీం కొను క్కుంటాను." అంటున్నాడా కుర్రాడు.

"యాభైపైసలు లేవు...పాడులేవు... ఇంతకు ముందే రూపాయిచ్చాను...పిచ్చిపిచ్చి వేషాలు వెయ్య కుండా త్వరగా వెళ్ళు...పాసెంజరొచ్చే టైమైంది... వెళ్ళు." గద్దించిందామె.

"కనీసం 25 పైసలన్నా ఇవ్వకుండా వెళ్ళను... వెళ్ళనంటే వెళ్ళను... అంతే!" అన్నాడా కుర్రాడు బండిని తోసుకుంటూ ముందుకెళ్ళిపోతూ-

"వెళ్ళవూ? వెళ్ళవూ?" అంటూ ఆమె అతని వెనకాలే పరిగెత్తి ఆ కుర్రాడి జుట్టు పట్టుకొని వెనక్కి ఈడ్చి ఈ చెంపా ఆ చెంపా వాయించసాగింది-

ఆ కుర్రాడు "అమ్మా! కొట్టకే... కొట్టకే... వెళ్తానే..." అంటూ యేడ్చాడు-" వెళ్ళు... త్వరగా వెళ్ళు... మంచిమాటకు వినవుకదూ?" అంటూ అతన్ని వదిలేసింది.

పెద్దగా విజిల్ వేస్తూ ఓ ట్రెయిన్ స్టేషన్ కొచ్చి ఆగింది.

కుర్రాడు బండిని వెనక్కి ఘళ్ళించి, రోడ్డుమీది కొచ్చి స్టేషన్ వైపు వేగంగా వెళ్ళసాగాడు-

నేను కాస్సేపు ఆమెకేసి చూస్తూ అలాగే నిల్చు న్నాను... ఆమె కాస్సేపు ఆ కుర్రాడు వెళ్ళిన వైపే చూస్తూ ఉండిపోయింది - తర్వాత తను కూడా స్టేషన్ వైపే వెళ్ళిపోయింది-

నేను జూనియర్ కాలేజి వైపు నడిచాను-

నేను వెళ్ళేటప్పటికే చాలామంది వాల్యూయర్స్ తమ తమ సీట్లలో కూర్చొని చకచకా పేపర్లు దిద్దే స్తున్నారు-

నేను మా ఛీఫ్ దగ్గరకెళ్ళి నా పేపర్లు తీసుకొని ఒక్కొక్క పేజీ చూసి మార్కులు వెయ్యసాగాను.

పరీక్ష పేపర్లు దిద్దటమనేది చాలా విసుగైన పని - పది పేపర్లు చూసేటప్పటికి చాలా మందికి ఓపిక నశించిపోతుంది - బయటకు వెళ్ళి కాఫీతాగి, సిగరెట్లు పేల్చి, గాసిపింగ్ చేసి మళ్ళీ వస్తారు - సాధ్యమైనంత త్వరగా ముప్పై పేపర్లు పూర్తి చేసి వెళ్ళి పోవాలని ప్రయత్నిస్తుంటారు - విద్యార్థి రాసిన ప్రతి వాక్యం చదివి మార్కులు వేసే వాళ్ళు చాలా తక్కువ మందే ఉంటారు - చాలా మంది మొదటి పేజిచదవగానే ఆ విద్యార్థి సత్తాయేమిటో పసిగట్టేస్తారు—

కొందరు వాల్యూయర్స్ ఎంత బాగారాసినా, ఎంత చెడ్డగా రాసినా మార్కులు ఒకేరకంగా ఇస్తూఉంటారు- మరీ ఎక్కువ, మరీ తక్కువ కాకుండా మార్కు వేస్తే చాలా సేఫ్ అని అనుకుంటూ ఉంటారు- ఇంకా కొందరు మరీ గుడ్డిగా మార్కులు వేస్తూఉంటారు- అలాంటివాళ్ళు చాలా తక్కువే అయినప్పటికి వాళ్ళవల్ల కొందరు విద్యార్థులకు కొంత అన్యాయం జరుగుతూనే ఉంటుంది.

నేను పేపర్లు దిద్దుతున్న హాల్లో ఫిజిక్స్ వాల్యూ యర్స్ కొందరు, సివిక్స్ వాల్యూయర్స్ కొందరూ ఉన్నారు. నేను సివిక్స్ పేపర్లు చూస్తున్నాను-నా పక్కనే కూర్చున్న మరో లెక్చరర్ ఫిజిక్స్ పేపర్లు చూస్తూ మార్కులు వేస్తున్నాడు-కాస్సేపెందుకో నేను నా పక్క వరుసలో ఉన్న ఫిజిక్స్ లెక్చరర్ రాఘవయ్యకేసి చూసాను. ఆయన దిద్దుతున్న పేపర్లో రంగు రంగుల బొమ్మలు కనిపించాయి-ఒక పువ్వు, ఆ పువ్వులోని భాగాలను చూపిస్తూ ఆ విద్యార్థి ఆ బొమ్మవేశాడు- ఆకస్మాత్తుగా నాకొక సందేహం కల్గింది-ఫిజిక్స్ మాష్టారు భుజం మీద చెయ్యివేసి-

"యేమండీ రాఘవయ్య గారూ! ఫిజిక్స్ పేపర్లో ఫ్లవర్స్ ఫిగర్సెందుకుంటాయండీ" అన్నాను.

అతడు వెంటనే ఓ గాఢనిద్రలోంచి లేచినట్టుగా ఉలిక్కిపడి

"యేమన్నారు? ఫ్లవర్సా? ఫిజిక్స్ పేపర్లో ఫ్లవ ర్సెందుకుంటాయి....కరెక్ట్! అయ్యబాబోయ్! ఇది ఫిజి క్స్ పేపర్ కాదండోయ్! బోటనీ పేపర్" అరిచి నట్టుగా అన్నాడాయన.

ఆ మాటవిని చుట్టపక్కలున్న వేరే లెక్చరర్స్ చాలామంది గొల్లున నవ్వారు-అప్పటికే రాఘవయ్య బోటనీ పేపర్ను ఫిజిక్స్ పేపరేననుకొని మూడొం తులు దిద్దేసి, మార్కులు వేసేశాడు-

"ఇప్పుడేం చేస్తారు? మూడొంతులు దిద్దేసి నట్టు న్నారే" అన్నాను.

"చేసేదేముంది...కోడింగ్ చేసిన వాళ్ళకు బుద్ధుందా? ఫిజిక్స్ పేపర్లో బోటనీ పేపరెందుకు పెట్టాలి" అంటూ ఆయన తన ఛీఫ్ ఎగ్జామినర్ దగ్గరకు వెళ్ళి-

"ఇందాక మీరిచ్చిన కట్టలో ఈ బోటనీ పేపరుంది"



## నేనెందుకు బతుకుతున్నాను

**నేనెందుకు బతుకుతున్నాను అనే కవితాసంకలనాన్ని పత్రికకు పంపాడు ఓ రచయిత.**

**కొన్నాళ్లకు పత్రిక ఆఫీసు నుండి సమాధానం వచ్చింది. దానిలో ఇలా వుంది:**

**"నీవు ఈ కవితలను పోస్టులో పంపావు కాబట్టి బతుకుతున్నావు"**

**—కె.వి.ఎం.ఆర్. (కాకినాడ)**



## దొర-దొంగాట

దాగుడు మూతా,
రాడీ రంగా,
పోలీసు వచ్చే—
గూండా భద్రం!
ఎక్కడి దొరలు-అక్కడే!!
గప్ చిప్!!!

—కె. లావణ్య




ఇంట్రోత్ ఆఫీసర్‌తో (రహస్యంగా): సార్! హెడ్డు గారు స్వంత పని మీద 3 గంటలకే అర్జెంటుగా వెళ్ళారట. మీరు క్యాంప్‌కి ఎన్ని గంటలకు వెళ్తారో రహస్యంగా తెలుసుకోమన్నారు సార్!

– ఎస్.ఎస్.ఎస్.వి. లక్ష్మి సుందరి,
హైదరాబాద్.

అన్నాడు.

"బోటనీ పేపరా? పొరపాటున వచ్చినట్టుంది- వెంటనే వెళ్ళి ఏ.సి.వో.వాల్యూయేషన్‌కు ఇచ్చిరావాలి" అంటూ ఛీఫ్ ఎగ్జామినర్ రాఘవయ్య చేతుల్లోంచి ఆ పేపర్ తీసుకుని అటూ ఇటూ తిరగేశాడు-

"ఇదేమిటి? మార్కులేశారేమిటి?" కంగారు పడి పోతూ అన్నాడాయన.

"పొరపాటున ఫిజిక్స్ పేపరేననుకొని వేసే శాను..." అన్నాడు రాఘవయ్య కొంచెం తడబడుతూ-

"బోటనీ పేపర్‌ను ఫిజిక్స్ పేపరని ఎలా అను కుంటారు?

కనీసం ఒక్కవాక్యం చదివినా తెలిసిపోతుందే... దిసీజ్ టూ మచ్" కోపంగా అన్నాడు వాళ్ళఛీఫ్ ఎగ్జామినర్-

"వాళ్ళు ఫిజిక్స్ కట్టలో బోటనీ పేపర్‌ను పడె య్యటం టూమచ్ కాదా? పోనీయండి సార్... మీరా పేపర్‌ను ఏ.సి.వో వాల్యూయేషన్‌కు పంపించండి." అన్నారు రాఘవయ్య చేతులు దులుపుకుంటూ-

"ఎలా పంపించను? మీరు మార్కులు వేసేశాక" అన్నాడు ఛీఫ్ ఎగ్జామినర్-

"పోనీయండి సార్... ఆ మార్కులు కొట్టేసి పంపించండి... ఆ పేపర్ దిద్దబోయే బోటనీ వాల్యూ యర్ మళ్ళీ మార్కులు వేసుకుంటాడు లెండి" అన్నాడు ఆ హాల్లోఉన్న అందరికంటె సీనియర్ లెక్చరర్ శ్రీధర్.

"నోనో... ఐ విల్ రిపోర్ట్ దిస్ మ్యాటర్" అన్నాడు ఛీఫ్ శ్రీధర్ కేసి చూసి. కాని అతని మాటల్లో పెద్ద పట్టుదల కనిపించలేదు.

"రిపోర్ట్ చేస్తే పెద్ద గొడవైపోతుంధి-రాఘవయ్యతో బాటు మీరూ, మరో పదిమంది ఇరుక్కుంటారు... ఎందుకొచ్చిన గొడవండి... గప్‌చిప్‌గా వెళ్ళి ఆ పేప రిచ్చేసి రండి." అన్నాడు శ్రీధర్.

ఆ హాల్లో ఉన్న మిగతా వాళ్ళందరూ "గప్‌చిప్‌గా ఆ మ్యాటర్‌ను క్లోజ్ చెయ్యటమే మంచిద"న్నారు.

పాపం! ఆ ఛీఫ్ ఎగ్జామినర్ మరోమాట మాట్లాడ కుండా ఆ పేపర్ పట్టుకొని బయటకు వెళ్ళిపోయాడు.

"యేమయ్యా! రాఘవయ్యా! కాస్త చూసి మార్కులు వెయ్యి... మరీ అంత అధ్వాన్నమైతే ఎలా?" అన్నాడు శ్రీధర్.

"చూస్తూనే ఉన్నానండి... ఆ పేపరే సరిగ్గా చూళ్ళేదు... యేదో జ్ఞాపకమొచ్చి తగలడింది." అన్నాడు రాఘవయ్య.

"ఇంటిదగ్గరున్న మీ ఆవిడగానీ జ్ఞాపకమొచ్చిందా?" అని శ్రీధర్ అనటంతో అందరూ గొల్లున నవ్వారు - యాభయ్యేళ్ళొచ్చిన రాఘవయ్య వాళ్ళంతా నవ్వటంతో తనూ నవ్వేశాడు-

నాలుగవుతుండగానే వాల్యూయర్స్‌లో చాలామంది ఆ రోజు దిద్దవలసిన పేపర్లను దిద్దేసి వెళ్ళిపోయారు-

నేనుకూడా నాలుగున్నరకు పూర్తిచేసేసి లాడ్జికు బయల్దేరాను-

రూమ్‌కెళ్ళేటప్పటికి మోహన్, మరో ఐదుగురు కలిసి పేకాడుతున్నారు-

"యేమిటి? అప్పుడే వచ్చేశారా?" అన్నాను.

"మేం మూడున్నరకే పూర్తిచేసి వచ్చేశాం - మీలాగ ఐదింటిదాకా ఉంటామనుకున్నారా?" అన్నాడు మోహన్.

నేను బట్టలు మార్చుకుంటుండగా మోహన్ అన్నాడు-

"బట్టలు మార్చుకోకండి... ఈ రోజు మనం పిక్చర్‌కెద్తున్నాం."

"పిక్చర్‌కా... చాలా టైర్డ్‌గా ఫీలౌతున్నాను." అన్నాన్నేను-

"అంత సీరియస్‌గా పేపర్లు దిద్దితే టైరయిపోక యేమవుతారు? సినిమాకెడదాం పదండి... కాస్సేపు రిలాక్సవుదురుగానీ." అన్నాడు మోహన్.

వాళ్ళు పేకాట ముగించి లేచారు- మిగతా ఐదు గురూ వాళ్ళ రూమ్స్‌కెళ్ళిపోయారు-

నేనూ, మోహన్ సినిమాకు బయల్దేరాం-

మోహన్ చాలా హుషారుగా విజిల్ వెయ్యసాగాడు.

"యేమిటి విశేషం...మీరు చాలా ఉత్సాహంగా కనిపిస్తున్నారు..." అన్నాను.

"పేకాటలో ఈ రోజు వంద రూపాయిలొచ్చాయి- వట్టిపుణ్యానికి...యేకష్టం లేకుండా డబ్బొస్తే హుషా రుగా ఉండదూ మరి?"

"ఔను..."

"అసలు మనం ఈ స్పాట్‌వాల్యూయేషన్ కెందు కొచ్చాం? ఓ వెయ్యి రూపాయిలొస్తాయని... జీతం కాకుండా వెయ్యిరూపాయిలంటే చాలా పెద్దమొత్తమే...

మనం చేసే పెద్దపనికూడా యేముండదు... ముప్ఫై పేపర్లను ఓ గంట సేపట్లో దిద్దేవాళ్ళున్నారు."

"అలా దిద్దేవాళ్ళు విద్యార్థులకెంత అన్యాయం చేస్తు న్నారో ఎప్పుడైనా ఆలోచిస్తారా? ఇదంతా విద్యార్థులను దోచుకోవటం కాదూ? మన విద్యార్థులంటే మనకు పిల్లల్లాంటివాళ్ళు...మన పిల్లల్ని మనమే దోచుకోవటం ఎంత ఘోరం..."కొంచెం ఆవేశంగా అన్నాను-

"మీరనవసరంగా ఆవేశపడిపోతున్నారు సార్! మనం జీవిస్తున్నదే దోపిడి వ్యవస్థలో... ప్రతిచోట దోపిడి... దోపిడీకి నావివరసలుండవు. ఈ వ్యవస్థలో తల్లిని బిడ్డ, బిడ్డను తల్లి కూడా దోచుకుంటారు.... ఈ దోపిడిని మనం ఆపగలమా?"

"ఆపలేకపోతే మానె... కనీసం మనంకూడా ఆ దోపిడీలో భాగస్వాములం కాకుండా ఉంటే చాలు."

"తప్పదుసార్... దోపిడి వ్యవస్థలో ప్రతివాడూ భాగస్వామి కాకతప్పదు..." అంటూ మోహన్ చాలా సేపు దోపిడి యొక్క వివిధ స్వరూపాలను గురించి మాట్లాడాడు.

సినిమా హాల్ సమీపించాము-

ఆ ఊర్లోకల్లా ఆ సినిమాహాల్ చాలా బావుంటుం దని చెప్పాడు మోహన్.

మోహన్ వెళ్ళి హైయెస్ట్‌క్లాస్ టికెట్లు తెచ్చాడు.

టికెట్లు తీసుకొని ఎయిర్‌కండిషన్డ్ చెయ్యబడ్డ భూలోక స్వర్గంలా ఉన్న ఆ హాల్లోకి వెళ్ళి కూర్చున్నాము. పిక్చరింకా మొదలెట్టలేదు-


మేం కూర్చున్న కాస్సేపటికి మాపక్క సీట్లల్లోకి ఇద్దరు ఆడవాళ్ళొచ్చి కూర్చున్నారు. వాళ్ళల్లో ఒకామెను చూడగానే ఈమెనెక్కడో చూశాననిపించింది. ఆమెకేసి మళ్ళీ చూసాను. ఆమె చాలా అందంగా ఉంది- ఆర్థికంగా ఎంతో ఉన్నత కుటుంబానికి చెందిన దాన్లా ఉంది... ఆమెనెక్కడో చూశాను...ఎక్కడ చూశాను?

జ్ఞాపకం చేసుకోవటానికి నా మస్తిష్కం గింజుకో సాగింది...అకస్మాత్తుగా గుర్తొచ్చింది... ఆమె ఎవరో ఎక్కడ చూశానో తెలిసిపోయింది. రైల్వేస్టేషన్.... తోపుడు బండి... కాళ్ళులేని కుర్రాడు... డబ్బుల పాత్ర....

గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

ఔను... మోహన్ అన్నమాట నిజమే...

దోపిడికి నావివరసలుండవు...



## మనసే మందారం

*జీవన మధుమాసంలో*
*ఆశ విరిసే నవ కుసుమం!*
*అనుభూతి విరిలోని మకరందం*
*ఆ అనుభూతుల మధురిమలో*
*వికసించే మనసు మందారం*

-వి. వాణిశ్రీ